క్లుప్తంగా

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


మల్లేష్‌ను సన్మానిస్తున్న దళిత సంఘాల నేతలు

కడప రూరల్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మల్లేష్‌ను ఆయన నివాసంలో వివిధ దళిత సంఘాల నేతలు కలిసి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు ఆంజనేయులు, బీసీ గంగులు, సుబ్బయ్య, ఓబులేసు, గుర్రప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణే ధ్యేయం


అలీషేర్‌కు పత్రం అందజేస్తున్న షా మహమ్మద్

కడప రూరల్: మానవ హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ షా మహమ్మద్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలన్నారు. మానవ హక్కుల సంఘాల నేతలు పెద్దన్న, బాదుల్లా మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా అలీషేర్‌ను నియమించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై సదస్సు


మాట్లాడుతున్న అధ్యాపకులు

వైవీయూ: విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు షకీలాబేగం, గోవిందరెడ్డి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల న్యాయచట్టం, పోక్సో చట్టం, చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్‌పై కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ పి.ఆర్. సునీతరాజు, సామాజిక కార్యకర్త లక్ష్మీప్రసన్న విద్యార్థినులు కౌమారు దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మోడల్ పేపర్ల ఆవిష్కరణ


మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైవీయూ: పదో తరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన మోడల్ పేపర్లను రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మంగళవారం ఆవిష్కరించారు. కడప నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ యూటీఎఫ్ విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు, వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏటా మోడల్ పేపర్ల ప్రచురణ చేపడుతోందన్నారు. సుదీర్ఘ అనుభవం, విషయ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే నమూనా పేపర్లు రూపొందించామని, ధర కేవలం రూ.75గా నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు కృష్ణారెడ్డి, ప్రభాకర్, సుబ్బారావు, కేదార్‌నాథ్, గోపీనాథ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, ప్రకాష్, పాల్గొన్నారు.


నేడు ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఆలయంలో బుధవారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. మార్గశిర ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం నిర్వహిస్తామన్నారు. ఈ ఏకాదశి రోజున ఉదయం గం. 7.04ని. గం .11.48 ని. వరకు రవి యోగం ఏర్పడుతున్నందున ఈ సమయంలో శ్రీ మహా విష్ణువును భక్తి శ్రద్ధలతో పూజించడం వలన సుఖ సంతోషాలు ఐశ్వర్యం పెరుగుతాయన్నారు. ఈ ఏకాదశి స్థితిలో రేవతి అశ్విని రెండు నక్షత్రాలు రెండు కూడా వస్తున్నందున దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మహా విష్ణువు మహాలక్ష్మీలను భక్తి శ్రద్ధలతో పూజిస్తే ఫలితం చేకూరుతుందన్నారు.

ఉద్యమ స్ఫూర్తి.. కాంస్యంతో కీర్తి

కడప కోటిరెడ్డి.. ఈ పేరు వినని జిల్లా ప్రజలు ఉండరంటే అతిశయోక్తి కాదు.. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆయన ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. తర్వాత కాలంలో కోటిరెడ్డితోపాటు, ఆయన సతీమణి ప్రజా ప్రతినిధులుగా జిల్లాకు సేవలు అందించారు. దీనికి గుర్తింపుగా కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కోటిరెడ్డి, కోటిరెడ్డి రామసుబ్బమ్మల కాంస్య విగ్రహాలను ఆవిష్కరించి వారి కీర్తి జిల్లాకు చాటనున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- చదువుల కోవెలలో కోటిరెడ్డి దంపతులకు చోటు
- నేడు కోటిరెడ్డి, రామసుబ్బమ్మ దంపతుల విగ్రహావిష్కరణ
- కళాశాల అభివృద్ధికి కోటిరెడ్డి వారసుల చేయూత



కోటిరెడ్డి, రామసుబ్బమ్మ చిత్రాలు , మహిళా డిగ్రీ కళాశాలలో విగ్రహావిష్కరణకు సిద్ధంగా ఉన్న కాంస్య విగ్రహాలు

వైవీయూ: ఉమ్మడి కడప జిల్లా మదనపల్లి సమీపంలోని కోటిరెడ్డిపల్లిలో జన్మించిన కోటిరెడ్డి.. మహాత్మా గాంధీ ప్రసంగాలకు ప్రభావితుడై స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. ఎంసీసీ, ఎల్ఎల్‌బీ, బీసీఎల్ పూర్తిచేసిన ఆయన మహాత్మాగాంధీ పర్యటనలో ఆయనకు అనువాదకర్తగా వ్యవహరించారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంతో పాటు ఎన్నో పోరాటాల్లో ఆయన పాల్గొన్నారు. 33 ఏళ్ల వయసులో మద్రాస్ శాసన సభకు ఎన్నికైన ఆయన 1922లో పదవికి రాజీనామా చేసి స్వరాజ్య పార్టీలో చేరారు. 1931లో తిరిగి ఆయన మద్రాస్ శాసనసభకు ఎన్నికయ్యారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో చక్రవర్తుల రాజగోపాలాచారి మంత్రివర్గంలో దేవాదాయశాఖ మంత్రిగా పనిచేసి మధుర, తిరునల్వేలి, శ్రీరంగం ఆలయాల్లో దళితులకు ప్రవేశం కల్పించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రెవిన్యూ మంత్రిగా సేవలందించారు. కడప, లక్కిరెడ్డిపల్లి శాసనసభలకు ప్రాతినిధ్యం వహించారు. 1964లో శాసనమండలికి నామినేట్ కాగా ఈయన 1981 జనవరి 28న కన్నుమూశారు. కాగా ఈయన విగ్రహాన్ని కడప నగరంలో అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఆవిష్కరించారు. ఈ ప్రాంతం ప్రస్తుతం జిల్లాలో కోటిరెడ్డి సర్కిల్‌గా పిలువబడుతోంది.

ఉద్యమంలో .. కోటిరెడ్డి రామసుబ్బమ్మ

కోటిరెడ్డి సతీమణి రామసుబ్బమ్మ తన భర్త జీవితాశయంలోనూ భాగస్వామి అయ్యారు. జాతీయోద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. కడప మున్సిపాలిటీ మొదటి మహిళా కౌన్సిలర్‌గా ఆమె ఎన్నికయ్యారు. జిల్లా బోర్డు తొలి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికై 1938 డిసెంబర్, 8వ తేదీ నుంచి 1942 అక్టోబర్ 26వ తేదీ వరకు పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఒకప్పుడు జిల్లా కోర్టుగా ఉన్న భవనంలో జిల్లాలోని మహిళలకు విద్యనందించే లక్ష్యంతో తొలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమె భూరి విరాళం ప్రకటించారు. కళాశాల నిర్మాణానికి సహకరించారు. ఇదే కళాశాల ప్రస్తుతం కోటిరెడ్డి రామసుబ్బమ్మ, కోటిరెడ్డి (ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా ఖ్యాతి పొందింది.

కోటిరెడ్డి వారసుల చేయూత..

తల్లిదండ్రుల వారసత్వంతోపాటు దాతృత్వాన్ని పుణికిపుచ్చుకున్న వారసులు కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. కోటిరెడ్డి కుమారుడు ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కె.జయభారత్‌రెడ్డి కోటి రూపాయలు వెచ్చించి కళాశాలలో మహిళల వసతి గృహం ఏర్పాటు చేయడంతో పాటు దానిని ఆధునీకరించారు. దాదాపు 300పైగా విద్యార్థినులు వసతి పొందుతుండడం విశేషం. ఈ నెల 11వ తేదీ బుధవారం కోటిరెడ్డి వారసులు రూ.13 లక్షలతో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయించారు. 2023–24 విద్యా సంవత్సరంలో అన్ని గ్రూపుల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులకు నగదు పురస్కారాల ప్రదానం చేయనున్నారు. దీంతోపాటు ఆర్థికంగా వెనుకబడిన పది మంది విద్యార్థినులకు అయ్యే హాస్టల్, భోజన ఖర్చు అందించేందుకు సిద్ధమైనట్లు ప్రిన్సిపల్ డా.వి.సలీం బాషా తెలిపారు. కోటిరెడ్డి వారసులు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి, సుచరిత, పద్మావతమ్మ, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు విగ్రహావిష్కరణలో పాల్గొననున్నట్లుపాయన తెలిపారు. వారితోపాటు కడప ఎమ్మెల్యే ఆర్. మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటుచేసిన రాజీవ్ మిశ్రా ఏక సభ్య కమిషన్‌ను రద్దు చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ పంజాబ్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 25 శాతం రిజర్వేషన్ కల్పించి వారి అభివృద్ధికి పాటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గుంటూరులో నిర్వహించనున్న మాలల సింహ గర్జనకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎ.బాబు, ఎం.సుధాకర్, సంయుక్త కార్యదర్శి ఎం.జయంత్, నాయకులు మునిరాజ్, బి.చిట్టిబాబు, బి.నవీన్, ఎ.రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

12న వ్యాసరచన పోటీలు

వైవీయూ: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల(ఆర్ట్స్ కళాశాల)లో ఈ నెల 12వ తేదీన వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.జి. రవీంద్రనాథ్ తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మాధ్యమాల్లో పోటీలు ఉంటాయని, డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్థులు 6301047495 నెంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మానవ హక్కులపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు


మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : మానవ హక్కులపై అవగాహన కల్పిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప న్యాయ సేవ సదన్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవాన్ని అధికారికంగా 1950వ సంవత్సరం నుంచి ప్రారంభించారన్నారు. జాతి, లింగ, వర్ణ, కుల, మత రాజకీయ వివక్షకు గురికాకుండా, చిత్ర హింసలు క్రూరత్వం నుంచి రక్షణ, వెట్టి చాకిరి బానిసత్వం నుంచి విముక్తికి మానవ హక్కులు ఉన్నాయన్నారు. స్వేచ్ఛగా దేశంలోనూ, విదేశాల్లోనూ పర్యటించే హక్కు అందరికీ ఉందన్నారు. అనంతరం ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పి.హరి బాబు, ఎం.శాంత, పి.మనోహర్ పాల్గొన్నారు

కడప స్పోర్ట్స్: మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ అన్నారు. నగరంలోని జేఎంజే జూనియర్ కళాశాల విద్యార్థులకు మానవ హక్కులు.. వ్యక్తిత్వ వికాసంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ సమానత్వం–అసమానతలు తగ్గించడం, మానవహక్కులను అభివృద్ధి చేయడం అంశాన్ని తీసుకుని మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ అడ్వకేట్ బి.గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ మానవులందరూ హక్కులను పొంది స్వేచ్ఛగా జీవించాలన్నారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.రోజ్‌రాణి, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బారాయుడు, నాగయ్య, నారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ: సమాజంలో మానవ హక్కులపై అందరికీ అవగాహన ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ , మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు స్టెల్లా షర్మిలారాణి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత, మనోహర్, డీసీపీఓ సుభాష్‌యాదవ్ వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, సురేష్, సహాయం, లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతి ఒక్కరూ మానవ హక్కుల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కాసలకోనయ్య అన్నారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా చైర్మన్ పోతురాజు లోకేష్ అధ్యక్షతన మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. కోనయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో బాలికలపై రోజూ ఏదో ప్రాంతంలో అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. వాటికి అడ్డుకట్ట వేయడంలో యువకులు కీలక పాత్ర పోషించాలన్నారు. జనసేన నాయకులు రమణ మాట్లాడుతూ సమాజమే కుటుంబంగా భావించి హక్కుల పరిరక్షణకు యువతరం ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, సురేష్, రాఘవ, పాస్టర్ పి.మహేష్, రామకృష్ణ, శిల్పారెడ్డి, సుధాకర్, గౌస్, జాకీర్, ప్రణవతి, చంద్రాయుడు, వెంకటలక్ష్మి, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు రంగం ప్రైవేటీకరణకు అడుగులు



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించే విద్యుత్తు ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లు తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. మనిషికి కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం ఎంత ముఖ్యమో అదే స్థాయిలో విద్యుత్ దైనందిన జీవితంలో ప్రధానంగా మారిందని, దానిని ప్రైవేటు వ్యక్తులకు ధారదత్తం చేస్తే దేశ భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. వేల సంఖ్యలో నూతన సర్వీసులున్నప్పటికీ కొత్తగా ఉద్యోగాల ఊసే ఎత్తకుండా అన్ని ప్రదేశాలలో ఔట్ సోర్సింగ్‌ల నియామకం సరికాదన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్తు సంస్థలో విలీనం చేసి నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటూ శాంతి నెలకొల్పాలి


పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆప్‌కీ ఆవాజ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశంలో శాంతి నెలకొల్పాలని, హిందూ ముస్లింలు ఐక్యతతో ముందుకు సాగాలని ఫాతిమా ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కరస్పాండెంట్ జవ్వాద్ అన్నారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ ముద్రించిన పుస్తకాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జవ్వాద్ మాట్లాడుతూ హిందూ ముస్లిం కలసి మెలసి ఉన్న ప్రాంతాల్లోనూ ఐక్యత పెరగాలన్నారు. ఆప్ కీ ఆవాజ్ కమిటీ ముద్రించిన పుస్తకం యువకులు చదవాల్సిన అవసరం ఉందన్నారు. ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బుల్‌బాషా మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణ త్యాగంతో దేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. దేశంలో అన్ని కులాలు, మతాలు ఐక్యత కలిగి ఉండేలా అందరూ కృషి చేయాలన్నారు. మతోన్మాద శక్తుల కుట్రలు ఎంతోకాలం సాగవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు షాజహాన్, కమలాకర్, సోమేశ్వరరావు, రామకష్ణ, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

చమత్కార రచయిత రామలింగారెడ్డి


కట్టమంచి రామలింగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కడప కల్చరల్: సాహితీవేత్త కట్టమంచి రామలింగారెడ్డి తన రచనల్లో చమత్కారాన్ని జోడించి అద్భుతమైన రచనలు చేశారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జున రెడ్డి అన్నారు. కడప రెడ్డి సేవా సమితి కార్యాలయంలో రామలింగారెడ్డి జయంతి మంగళవారం నిర్వహించారు. కట్టమంచి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ‘కళా ప్రపూర్ణ’ కట్టమంచి రామలింగారెడ్డి శైలి విలక్షణమైనదని, అదే ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు చేకూర్చిందన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ రామలింగారెడ్డి రచనలు సమాజం, సాటి రచయితలపై వాటి ప్రభావం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లెక్కల కొండారెడ్డి, కుప్పిరెడ్డి నాగిరెడ్డి, గుడ్ల ఆదినారాయణరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి, యం.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో లలిత కళలకు ఆదరణ


విద్యార్థులతో అతిథులు

ఏఎఫ్‌యూ: సమాజంలో లలిత కళలకు ఎంతో ఆదరణ ఉందని ఆంధ్రా విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం ఆచార్యులు ఎం.ఆదినారాయణ అన్నారు. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సమాజంలో కళ–మాండలికం అంశంపై మంగళవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులను సాత్వికులుగా తీర్చిదిద్దడంతోపాటు, మానవత్వాన్ని బతికించే శక్తి కళకు ఉందన్నారు. కళలకు ఆయా ప్రాంతాల్లోని మాండలికం ప్రాణం పోస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డి ఆదినారయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి.బీమాచారి, కె.అప్పలనాయుడు, కె.సుకుమార్‌రెడ్డి, సి.హెచ్.దుర్గాప్రసాద్, సి.హెచ్. నూకరాజు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. కడప నగరం లోని ఏబీవీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైవీయూలోని సీవీ రామన్ సైన్స్ బ్లాక్‌పైన వర్షపు నీరు నిలబడి.. బయటకు వెళ్లేందుకు వీలు లేక భవనం పైకప్పు దెబ్బతింటోందన్నారు. వైవీయూ విద్యార్థులు నీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రయోగశాలల్లో కరెంట్ అప్ అండ్ డౌన్ రావడంతో భయాందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చాన్స్‌లర్ బంగళాను వైవీయూలో ఏర్పాటు చేయాలని కోరారు. వసతి గృహాల్లో భద్రత కోసం నిత్యం నైట్ విజన్ చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పవన్, చందు, ప్రశాంత్, విష్ణు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం వద్దు


కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్ఎస్‌పీ నాయకులు , తదితరులు

వైవీయూ: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపడం తగదని ఆర్ఎస్‌పీ కన్వీనర్ సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. విద్యుత్ భారాన్ని తగ్గించాలంటూ రూపొందించిన కరపత్రాలను నగరంలో మంగళవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలపై 9412 కోట్ల రూపాయల భారం వేశారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే విద్యుత్తు ఛార్జీల పెనుభారం వేశారని విమర్శించారు.లీ కార్యక్రమంలో శ్రీనివాసులు, నరేంద్ర, గోపీ, అయ్యన్న, భాస్కర్, కేశవ, నరసింహారావు, చరణ్, అనిల్ పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

కమలాపురం : వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, ఇతర ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వారు చేసిన సూచనలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ, ఆత్మ పీడీ విజయలక్ష్మీ తెలిపారు. మంగళవారం మండలంలోని కోగటం, ఎర్రగుడిపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో భాగంగా సాగులో ఉన్న మినుము, శనగ, నువ్వు పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ శనగ పంటకు ఆకు మాడు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు 400 మి.లీ. హెక్సాకోనోజల్, లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాముల చొప్పున ఎకరానికి 5 కిలోల 13.0.45 ను కలిపి పిచికారి చేయాలన్నారు. మినుము, నువ్వు పంటలకు బూడిద తెగులు ఆశిందని, నివారణకు 1గ్రాం. కార్బెండిజం, 1.5 గ్రాం. మైక్లో బూటానిల్ కలిపి పిచికారి చేయాలన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు , అలంకరణలో విజయదుర్గమ్మ అమ్మవారు

కడప కల్చరల్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు దోష నివారణ కోసం మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మ వారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా రాహుకాల పూజలు జరిపారు. అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాలిక సజీవ దహనం అమానుషం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నంద్యాల జిల్లా నందికొట్కూరులో బాలికను సజీవ దహనం చేయడం అమానుష చర్య అని, ఈ ఘటనపై న్యాయ విచారణ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, కడప నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీ.కె.అఫ్జల్‌అలీఖాన్ డిమాండ్ చేశారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ నందికొట్కూరులో ఓ బాలికను రాఘవేంద్ర అనే వ్యక్తి సజీవ దహనం చేసిన పాశవిక ఘటన ప్రజలందరినీ కలచి వేసిందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు, అత్యాచార ఘటనలు, హత్యలు పేట్రేగిపోయాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనితకు బెదిరింపు కాల్స్ రావడం చూస్తే శాంతి భద్రతల పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం అవుతోందన్నారు. చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పరిపాలనా దక్షుడని ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నప్పటికీ, రాష్ట్రంలో లెక్కకు మించి నేరాలు–ఘోరాలు జరగడం దురదష్టకరమన్నారు. ప్రధానంగా మహిళలకు భద్రత కరవైందని, రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్.షర్మిలారెడ్డి డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. హత్యలు, అత్యాచారాలపై న్యాయ విచారణ చేస్తే నిజాలు వెలుగుచూస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్యామలమ్మ, సంజయ్ కాంత, హమీద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.